సాక్షి చిత్తూరు

శుక్రవారం । 23 । మే । 2025




మామిడికి గిట్టుబాటు కల్పించాలి

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందని రైతులు పేర్కొన్నారు. - 10లో



మళ్లీ గజ దాడులు

కొద్దిరోజుల విరామం అనంతరం సదుం మండలంలోని పంట పొలాలపై ఏనుగులు దాడులు చేసి ధ్వంసం చేశాయి. - 10లో



రెవెన్యూ బదిలీలు!

రెవెన్యూ బదిలీలకు ఉమ్మడి చిత్తూరు కేంద్రంగా గురువారం నుంచి కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేపడుతున్నారు. - 10లో

న్యూస్‌రీల్

కోవిడ్‌పై భయం వద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కోవిడ్ వ్యాప్తికి ప్రజలు భయపడొద్దని ..అలా అని అజాగ్రత్తగా ఉండకూడదని..తగు జాగ్రత్తలతో బయటకు వెళ్లాలని డీఎంఅండ్‌హెచ్ సుధారాణి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విదేశాల నుంచి వచ్చే వారిపై దృష్టిపెడుతున్నామన్నారు. వారికి కోవిడ్ పరీక్షలు చేసేలా ఆదేశాలు వచ్చాయన్నారు. కోవిడ్ లక్షణాలుంటే.. ఐసోలేషన్‌లో ఉండేలా చూడాలని ఆదేశాలుండాయన్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో గుంపులు చేరొద్దన్నారు. మాస్కులు వాడడం మంచిదన్నారు. చేతుల శుభ్రత, భౌతికదూరం పాటించడం ఉత్తమన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు ముందు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

కుస్తీ పోటీలకు ఎంపిక

యాదమరి : రాష్ట్రస్థాయి అండర్ 17 బాలబాలికల కుస్తీ పోటీలలో యాదమరి ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారిణి జీవనగీత ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు చిత్తూరు మేసానికల్ క్రీడా మైదానంలో జరిగిన కుస్తీ పోటీలలో వివిధ రాష్ట్రాల క్రీడాకారిణిలతో పోటీ పడి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. దీంతో ఈనెల 23వ తేదీ నుంచి 25 వరకు చండీఘర్‌లో జరగనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధించడంతో క్రీడాకారిణి జీవనగీత మన రాష్ట్రం తరపున ఆడనుంది. ఈ సందర్భంగా జీవనగీతను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, పీడీలు రవి, హరికృష్ణ, దాము , ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా అభివృద్ధిపై సీఎంకు 27 ప్రతిపాదనలు

- టీడీపీ జిల్లా మహానాడులో నేతల తీర్మానం



మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు..చిత్రంలో టీడీపీ ఎమ్మెల్యేలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి 27 అంశాలతో కూడిన ప్రతిపాదనలు సీఎం చంద్రబాబు నాయుడు ముందు ఉంచనున్నట్లు టీడీపీ నాయకులు తీర్మానించారు. గురువారం చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా మహానాడును అధ్యక్షుడు సిఆర్.రాజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళుతోందన్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ.. నగరి నియోజకవర్గంలోని మూడు మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేస్తామన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు. విజయపురంలోని కోసల నగరాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్ నాయుడు, కలికిరి మురళీమోహన్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, పరిశీలకులు మారుతి చౌదరి, సునీల్‌కుమార్, టీడీపీ నేతలు దొరబాబు, మనోహన్, చంద్రప్రకాష్, సురేంద్రకుమార్, హేమలత, త్యాగరాజన్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.



స్టేజీ పై యోగాసనాలు చేస్తున్న యోగా గురువులు

ఆరోగ్య యోగం



యోగా చేస్తున్న విద్యార్థినులు, అధికారులు



యోగా చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు



చిత్తూరు కలెక్టరేట్ : జీవన విధానంలో యోగా సాధనను ఒక భాగంగా చేసుకుంటే అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల మైదానంలో గురువారం యోగా మాసోత్సవాలను ప్రారంభించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21 నుంచి నెల రోజుల పాటు యోగా సాధనపై యోగాంధ్రా–2025 నినాదంతో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ.. యోగాతో ఆరోగ్యంతో పాటు చదువు, ఆటల్లో చురుగ్గా ఉంటారన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. దేశం మొత్తం యోగా దినోత్సవం చేసుకుంటోందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, అధికారులు, ప్రజాప్రతినిధులు , విద్యార్థులు యోగాసనాలు వేశారు. చుడా చైర్మన్ కఠారి హేమలత, డీఆర్‌వో మోహన్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీఈవో వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బండికి బ్రేకులు

- ఇంటింటా రేషన్‌కు కూటమి మంగళం
- ఎండీయూ వాహనాలు రద్దు
- చౌక దుకాణాల ద్వారానే ఇక సరుకులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కార్డుదారులు

ఇంటి నుంచి కాలు కదపకుండా.. కష్టం తెలియకుండా గడప వద్దే రేషన్ అందించిన ఘనత గత ప్రభుత్వ చరిత్ర.. నేటి కూటమి ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పునకు కిలో మీటర్ల కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి .. గంటల తరబడి చౌక దుకాణం ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నేడు కార్డుదారులు ఎదుర్కోవాల్సి రావడంతో కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదల కోసం గత వైస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఒక్కో పథకాన్ని కూటమి సర్కారు నిర్వీర్యం చేస్తుండడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు వేల మంది ఎండీయూ ఆపరేటర్లు నేడు ఉపాధి లేక రోడ్డున పడ్డారు. – కాణిపాకం



రేషన్ పంపిణీ చేస్తున్న ఆపరేటర్ (ఫైల్)



జేసీకి వినతి చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కూటమి ప్రభుత్వం బియ్యం పంపిణీ బండికి బ్రేకులు వేసింది. ఇంటింటా రేషన్‌కు మంగళం పాడింది. రేషన్ వాహనాలను రద్దు చేసింది. ప్రభుత్వం దెబ్బకు అయిదేళ్లుగా సేవలు అందించిన (ఎండీయూ) మొబైల్ డిస్ట్రిబ్యూటరీ యూనిట్లు నిలిచిపోనున్నాయి. వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారి బతుకులు రోడెక్కనున్నాయి. ఈ నిర్ణయంతో చంద్రబాబు నైజమేంటో మరోసారి ప్రజలకు తేటతెల్లమైంది. దీనిపై కార్డుదారులు, ఎండీయూ వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ షాపునకు వెళ్లాల్సిందే..

హామీలివ్వడం అధికారంలోకి వచ్చాక గాలికొదిలేయడం చంద్రబాబుకు పరిపాటి. తాజాగా ఇంటింటికి సరుకులు అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేసి, మళ్లీ పాత పద్ధతిలో సరుకులు ఇస్తామని ప్రకటించారు. జిల్లాలో 1390 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి కింద 5.40 లక్షల కార్డుదారులు ఉన్నారు. వారందరికీ 9వేల మెట్రిక్ టన్నుల మేర రేషన్‌ను పంపిణీ చేయాలి. దానికోసం వైఎస్సార్‌సీపీ 336 ఎండీయూ వాహనాలను పెట్టి ఇంటింటికీ సరుకులు పంపిణీ చేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాహనాల భారాన్ని భరించలేక ఏకంగా రద్దు చేసేసి పాత పద్ధతిలో పంపిణీ చేస్తామంటోంది. అంటే ప్రజలు రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తుంది.

ఇంటింటి సేవలకు మంగళం

కూటమి ప్రభుత్వం సంక్షేమాన్నే కాదు ప్రజలకు ఇవ్వాల్సిన సేవలను కూడా వదిలేస్తోంది. వైఎస్ జగన్ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. సేవలు అందుకోవడం ప్రజల హక్కు అని భావించి.. సామాన్యుడి ఇంటి వద్దకే అనేక సేవలు అందజేసింది. వలంటీర్ల ద్వారా ప్రజలకు ఏం అవసరమో గుర్తించి, వాటిని నేరుగా అందజేసింది. సంక్షేమ పథకాలతో పాటు అధికారిక సేవలను ఇంటి చెంతకే చేర్చింది. 15 వేల మందికి పైగా వలంటీర్ల ద్వారా ప్రజలకు 539 సేవలు అందించింది. రేషన్ అందించడం కోసం వాహనాలను ఏర్పాటు చేసి వేల మందికి ఉపాధి చూపించింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే వలంటీర్ వ్యవస్థను తీసేసింది. ప్రతి పౌర సేవకు వీధివీధితోనూ ఐదేళ్లుగా అనుబంధం పెనవేసుకున్న రేషన్ బండ్లు ఆగిపోనున్నాయి. సామాన్యుడి ఇంటి వద్దకే వచ్చి సరుకులు అందించిన ఈ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇక రేషన్ కోసం డిపో ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సిందే.

రోడ్డున పడిన ఆపరేటర్లు

జిల్లాలో ఎండీయూ వాహనాలపై ఆపరేటర్లతో పాటు సిబ్బంది ఆధారపడి ఉన్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.18 వేల వరకు వచ్చేది. 1500 నుంచి 2000 ఇళ్ల వరకు సరుకులు నేరుగా పంపిణీ చేసేవారు. వీరంతా ఇప్పుడు రోడ్డున పడాల్సిందే. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. వాస్తవంగా ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం గడువు ఉంది. కానీ ఉన్న ఫలంగా వాహనాలను ఆపేయడంతో వారి పరిస్థితి దయనీయంగా త యారైంది. వారంతా ఆందోళన చెందుతున్నారు. రోడ్డెక్కడానికి సిద్ధమవుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆపరేటర్‌లపై పగబట్టి ప్రతికారం తీర్చుకుంటోంది. జీతాల్లో కోతలు పెట్టించి నానా అవస్థలకు గురిచేసింది.

హఠాత్తుగా నిలుపుదల చేస్తే ఎలా?



రేషన్ పంపిణీ బండిని నమ్ముకుని జీవిస్తున్నాం. ఉన్నట్టుండి ఈ సేవను నిలిపి వేస్తే ఎలా. మేమంతా ఏమైపోవాలి. కనీస సమాచారం లేదు. ఇన్నాళ్ల రాష్ట్ర నాయకులు మంత్రులతో మాట్లాడారు. వాళ్లతో మంత్రులు సానుకూలంగానే మాట్లాడారు. ఇంతలో ఇలా చేయడం దారుణం. మళ్లీ ఈ వాహన సేవను యథావిధిగా కొనసాగించాలి. లేకుంటే న్యాయస్థానంను ఆశ్రయిస్తాం.

– వేణు ఏండీయూ ఆపరేటర్ల జిల్లా నాయకులు, చిత్తూరు

ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి



2027 జనవరి వరకు అగ్రిమెంట్ ఉంటుంది. కానీ కనీస సమాచారం ఇవ్వకుండా ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం సరికాదు. ఈ వ్యవస్థను మళ్లీ యథావిధిగా కొనసాగించాలి. పెండింగ్‌లోని వేతనాలను ఇవ్వాలి. ఒక్కో బండిపై లక్ష అప్పులు ఉన్నాయి. ఈ బకాయిలను కార్పొరేషన్‌కు చెల్లించకపోతే మా జీతాల్లో కోతలు పెడుతున్నారు. మాకు న్యాయం చేయాలి.

– దుర్గా ప్రసాద్, బంగారుపాళ్యం

రేషన్ బండ్లను కొనసాగించాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఎండీయూ ఆపరేటర్ల సంఘం నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ఎండీయూ వ్యవస్థను కూటమి టీడీపీ కొనసాగించాలని జిల్లా ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు తమ డిమాండ్‌లను పరిష్కరించాలంటూ గురువారం కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. ఎండీయూనే నమ్ముకుని జీవిస్తున్న లక్షల మందికి ప్రభుత్వం అన్యాయం చేయడం సరికాదన్నారు. అర్ధాంతరంగా ఎండీయూలను నిలిపి వేస్తే ఉపాధి కోల్పోవడంతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. తమకు బ్యాంకుల నుంచి ఇబ్బందులు లేకుండా ఎన్‌వోసీ ఇచ్చిన తర్వాతే రద్దు పై నిర్ణయం తీసుకోవాలన్నారు. అప్పటి వరకు ఎండీయూలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని కుప్పం, పలమనేరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు, నగరి, పుంగనూరు నియోజకవర్గాల నుంచి ఎండీయూ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై తమ్ముళ్ల కీచులాట

- రూ కోటికి పైగా విలువైన భూమి ఆక్రమణ

శాంతిపురం : నిబంధనలు తుంగలో తొక్కి అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములతో అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ దందా సాగుతున్నా, దీనిపై సోషల్ మీడియాలో రచ్చ సాగుతున్నా రెవెన్యూ అధికారులు మొద్దు నిద్రను వీడడం లేదు. డొంకుమానిపల్లి రెవెన్యూలో పలమనేరు జాతీయ రహదారికి దగ్గర్లో 0.45 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక టీడీపీ నాయకుడు అదే పార్టీలోని కడపల్లి పంచాయతీకి చెందిన మరో నాయకుడికి విక్రయించాడు. రూ.కోటికి పైగా విలువైన ఈ వ్యవహారంలో విక్రయ అగ్రిమెంటు చేసుకుని రూ.25 లక్షల వరకూ చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది. అయితే అసైన్డ్ (దరఖాస్తు పట్టా) భూమిగా చెప్పి విక్రయించిన ఈ స్థలం రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ అనాధీన భూమిగా తేలడంతో పాటు విస్తీర్ణం విషయంలో ఇరువురు నాయకుల నడుమ వివాదం తలెత్తింది. తనను మోసం చేశాడని కొనుగోలుదారు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, క్రిమినల్ తెలివితేటలు చూపుతున్నాడని విక్రయదారు వీడియోలు విడుదల చేశారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూమిలో వాణిజ్య భవనాలు కట్టుకున్నారని ఒకరు, పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకుని రూ.10తో వడ్డీతో వ్యాపారం చేస్తున్నారని మరొకరు నిందించుకున్నారు. ఈ వివాదంలో కుప్పం ఆర్డీవో కార్యాలయం వద్ద ఇరువర్గాలు పరస్పర దాడులకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ విమర్శలు, ప్రతి విమర్శలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారితే, తెలుగుదేశం పార్టీ వాట్సాప్ గ్రూపుల్లోనూ జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ రాద్ధాంతం చూసిన వాళ్లు మాత్రం ప్రభుత్వ భూమికి కీచులాడుకొంటున్నారని తిట్టిపోస్తున్నారు. సామాన్యుల విషయంలో చట్టాలను అమలు చేసే రెవెన్యూ శాఖ ఇంత పెద్ద వ్యవహారంలో మాత్రం పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను తేల్చడంతో పాటు భవిష్యత్తు అవసరాల కోసం మండల కేంద్రం, పరిసరాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతున్నారు.

ఉపాధికి నిచ్చెన

పేద విద్యార్థులకు డెయిరీ టెక్నాలజీ కోర్సు వరంగా మారింది. రెండేళ్ల కోర్సు పూర్తి కాగానే ఉపాధి అవకాశాలు లభిస్తుండడం విద్యార్థులను ఆకర్షిస్తోంది. కోర్సులో చేరేందుకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు లేకపోవడం గ్రామీణ విద్యార్థులకు మరింత చేరువ అయింది. ఈ కోర్సు పూర్తి చేసిన వారు ఇప్పటికే 60 శాతం మంది ఉపాధి అవకాశాలు దక్కించుకున్నారు. పైగా స్వయం ఉపాధి పొందే వీలుంది. సొంతంగా డెయిరీ ఫాం పెట్టుకొని రాణించే అవకాశాలు ఉండడంతో మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సుతో ఉన్నత చదువులకు అవకాశం ఉండడంతో ఈ కోర్సుపై అందరికీ ఆసక్తి నెలకొంది.

పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల




విద్యార్థులకు ప్రయోగాలను నేర్పుతున్న అధ్యాపకులు



- పేద విద్యార్థులకు డెయిరీ టెక్నాలజీ కోర్సు వరం
- కోర్సు పూర్తి కాగానే మెండుగా ఉపాధి అవకాశాలు
- జిల్లాలో రెండు ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే ఈ కోర్సు
- ద్వితీయ సంవత్సరంలోనే ప్రాంగణ ఎంపికలు

పలమనేరు : పదో తరగతి కాగానే కార్పొరేట్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు చదివించి ఆపై నీట్, ఎంసెట్ ద్వారా ఉన్నత చదువులు చదివించలేని పేద తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశపెట్టిన రెండేళ్ల డెయిరీ టెక్నాలజీ కోర్సుతో వెంటనే ఉద్యోగాలు పొందేందుకు ఓ వరంలా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఈ కోర్సుపై చాలా మందికి అవగాహన లేదు.



విదార్థులకు బోధిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి, పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రమే ప్రస్తుతం ఈ కోర్సు అందుబాటులో ఉంది.

ఎటువంటి పరీక్ష లేకుండానే ప్రవేశం

×పది× ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండానే డెయిరీ టెక్నాలజీ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. ఒక్కో కళాశాలలో 40 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఈ కోర్సును పూర్తి చేస్తే వెటర్నరీశాఖలో వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగాలకు వెళ్లవచ్చు. ఇక జిల్లాలో పాలపరిశ్రమ జోరందుకుంది. దీంతో పలు ప్రైవేటు పాల డెయిరీలున్నాయి. ఇందులో టెక్నీషియన్ ఉద్యోగాల కోసం పలు కంపెనీలు ద్వితీయ సంవత్సరంలో ఉండగానే కళాశాలలో ప్రాంగణ ఎంపికలు చేస్తున్నారు. ఉన్నత చదువులకు వెళ్లాలంటే బీఎస్సీ (డెయిరీ సైన్సు) లోనూ చేరవచ్చు. ఇందులో డిగ్రీ పూర్తయిన వారికి ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు దక్కుతాయి. వీటికి వేతనాలు భారీగానే ఉంటాయి. కోర్సు పూర్తి చేసిన వారికి పశుసంవర్ధకశాఖలో ఉద్యోగా అవకాశాలుంటాయి.

గ్యారెంటీగా ఉపాధి అవకాశాలు

పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కోర్సును 2015–16లో ఏర్పాటు చేశారు. ఇప్పటి దాకా ఈ కోర్సు పూర్తి చేసిన వారిలో 60 శాతం మందికి ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని పాల డెయిరీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మిగిలిన వారిలో కొందరు ఉన్నత చదువులకెళ్లారు. ప్రభుత్వ, ప్రైవేటులో ఉపాధి లేకున్నా సొంతంగా డెయిరీ ఫాం పెట్టుకొని స్వయం ఉపాధి పొందే అవకాశం ఉన్న కోర్సు కారణంగా దీనికి మంచి డిమాండ్ ఉంది.

కోర్సు చదువుతుండగానే ఎంపికలు



గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరం లాంటిది. కోర్సు చదువుతుండగానే ఉద్యోగాలిస్తామంటూ పాల డెయిరీలు ముందుకొస్తున్నాయి. వెటర్నరీ పాలిటెక్నిక్‌లో చేరాలంటే ఎంట్రన్స్ రాయాలి. కానీ ఇందులో నేరుగా ప్రవేశం పొందవచ్చు. పైగా ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయి. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

– గురుప్రసాద్‌రెడ్డి, డెయిరీ టెక్నాలజీ కోర్సు ఇన్‌చార్జి, పలమనేరు

ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో చేరాను



మాది తవణంపల్లి మండలం గాజులపల్లి. మా తండ్రి రవి ట్రాక్టర్ డ్రైవర్, తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.డెయిరీ టెక్నాలజీ కోర్సు చేస్తే తప్పకుండా ఉద్యోగం వస్తుందని తెలుసుకున్నా. డెయిరీ టెక్నాలజీ కోర్సు పూర్తి చేశా. మొన్నటి ఫలితాల్లో 971 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకు సాధించా. చదువుతూ ఉండగానే ఉద్యోగాలకు ఎంపిక కావాలన్నదే లక్ష్యం.

– హర్షిత, డెయిరీ టెక్నాలజీ కోర్సులో స్టేట్ టాపర్

కోర్సు పూర్తి కాగానే ఉద్యోగం



మాది పలమనేరు మండలంలోని సముద్రపల్లి గ్రామం. పేద కుటుంబం కావడంతో ఉన్నత చదువులకు వెళ్లలేదు. దీంతో డెయిరీ టెక్నాలజీ కోర్సులో చేరా. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించా. ఈ గ్రామానికి పక్కనే ఉన్న పరాగ్ డెయిరీలో ప్రస్తుతం ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తున్నా.

– లవకుమార్, టెక్నీషియన్, పరాగ్ డెయిరీ, పలమనేరు

'డెప్యుటేషన్‌లను కొనసాగిస్తున్నాం'

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వైద్య విధాన పరిషత్‌లో డెప్యుటేషన్లను కొనసాగిస్తున్నామని డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దినపత్రికలో గురువారం డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో వర్గపోరు పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై ఆమె స్పందించారు. డెప్యుటేషన్ విషయంపై ఆస్పత్రి అధికారులు, కార్యాలయ అధికారులతో మాట్లాడారు. తప్పిదాలను తెలుసుకున్నారు. డెప్యుటేషన్ల రద్దు చేస్తూ ఇచ్చిన ఆర్డర్లను వెనక్కు తీసుకున్నారు. ఈ డెప్యుటేషన్లు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిని పిలిచి కార్యాలయానికి చెడ్డపేరు రాకుండా చూడాలని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆమె హెచ్చరించారు.

క్లుప్తంగా

మళ్లీ ప్రారంభమైన గజ దాడులు

సదుం : కొద్ది రోజుల విరామం అనంతరం మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు మళ్లీ ప్రారంభం అయ్యాయి. చెరకు వారిపల్లె పంచాయతీ పరిధిలోని పోతం వారి పల్లె, కుమ్మరిపల్లె సమీపంలోని మామిడి చెట్లపై ఏనుగులు దాడి చేశాయి. సుమారు 15 వరకు ఉన్న ఏనుగుల గుంపు గురువారం ఉదయం మామిడి చెట్లను విరిచి వేయడంతో పాటు, డ్రిప్ పరికరాలు, నీటి సరఫరా పైప్‌లను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు వెంటేష్, కామేశ్వర, సోమశేఖర్, లక్ష్మమ్మ, ఆదిలక్ష్మి, లక్ష్మమ్మ, శ్రీనివాసులు, రమేష్, మునుస్వామి వాపోయారు. అటవీ ప్రాంతాల్లో ఏనుగులు సంచారం మళ్లీ ప్రారంభం కావడంతో సమీప గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అక్రమ క్వారీలు నిర్వహిస్తే చర్యలు



కొత్తపల్లె వద్ద క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళెం : అక్రమ క్వారీలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని మైనింగ్ అధికారులు హెచ్చరించారు. గురువారం మండలంలోని కొత్తపల్లె, జంబువారిపల్లె వద్ద అక్రమ క్వారీలను పలమనేరు మైనింగ్ అధికారులు జియాలజిస్టు కుమారస్వామి, రాయల్టీ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమాలకు పాల్పడి క్వారీ తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. అదే విధంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టేవారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కుళ్లినస్థితిలో మృతదేహం

పెద్దపంజాణి : మండల పరిధిలోని శంకర్రాయలపేట గ్రామ సమీపంలోని మామిడి తోటలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంకర్రాయలపేటకు చెందిన జాన్సీ అనే మహిళకు చెందిన మామిడి తోటలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం పురుషుడిదిగా గుర్తించి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసు లు తెలిపారు. మృతుడు నలుపు రంగు బెల్టు, ప్యాంటు ధరించినట్లు పేర్కొన్నారు. నెల రో జుల క్రితం ఓ వ్యక్తికి కొన్ని వస్తువులు లభ్యం కాగా ఆ వస్తువుల్లోని ఫోన్ నంబరు ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు స మాచారం. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాధల బదిలీలు

- మెడికల్ సమస్యలు ఉన్న టీచర్ల పరిస్థితి దారుణం
- అంగవైకల్యం తగ్గించి ఇచ్చిన సర్టిఫికెట్లతో ఆందోళన
- ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్న టీచర్లు



చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల్లో సమస్యలపై గురువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మెడికల్ సమస్యలు ఉన్న టీచర్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మెడికల్ బోర్డులు అంగవైకల్యం శాతం తక్కువగా నమోదు చేస్తూ జారీ చేసిన సర్టిఫికెట్‌లతో బదిలీల్లో మొదటి అవకాశం కోల్పోతున్న పరిస్థితి ఏర్పడుతోందని బాధిత టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెడికల్ సమస్యలున్న టీచర్లకు అన్యాయం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కోటాలో ఉద్యోగాలు పొందిన వారు, వయస్సు ప్రభావంతో మెడికల్ సమస్యలు ఏర్పడిన వారు, ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరైనా అంగవైకల్యం ఉన్న టీచర్ల కు బదిలీల్లో మొదటి అవకాశం కల్పిస్తారు. ఇందుకు మెడికల్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్ ఆధారంగా దరఖాస్తు చేసుకుంటారు. టీచర్లకు ఇటీవల తిరుపతి జిల్లా రుయా ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఆ క్యాంపుల్లో గతంలో ఉన్న సర్టిఫికెట్లు కాకుండా కొత్తగా మెడికల్ సర్టిఫికెట్‌లు జారీచేశారు. ఈ ప్రక్రియ రుయా ఆసుపత్రి మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆందోళనలో గురువులు

గతంలో ఎన్ని సంవత్సరాలు సర్వీస్ ఉంటే అన్ని పాయింట్లు ఏడాదికి మూడు చొప్పున కేటాయించేవారు. ఇప్పుడు పాయింట్‌లకు ఎనిమిది సంవత్సరాల సీలింగ్ పెట్టారు. అంతకు మించి సర్వీస్ ఉన్నా పాయింట్‌లు నమోదు లేకుండా చేశారు. దీంతో 2014 డీఎస్సీ, 2016 స్పెషల్ డీఎస్సీ, 2015 లో బదిలీ అయిన టీచర్లకు నష్టం వాటిల్లుతుందని టీచర్లు గగ్గోలు పెడుతున్నారు.

గతం...ప్రస్తుతానికి పొంతనే లేదు...

గతంలో ఉన్న అంగవైకల్యం శాతానికి ఇప్పుడు రుయా మెడికల్ బోర్డు ఇచ్చిన శాతానికి పొంతనే లేకుండా పోయింది. చికిత్సలకు వెళ్లిన టీచర్లలో చాలా మందికి బహిరంగంగానే అంగవైకల్యం కనిపిస్తోంది. అయితే తక్కువ శాతం నమోదు చేసి ఇవ్వడంపై టీచర్లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మెడికల్ శాతం తక్కువగా నమోదు చేయడంపై వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు మరోసారి మెడికల్ పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. బాధిత టీచర్లు పలువురు రుయా అధికారులను కలవగా డీఈఓ ఉత్తర్వులు తెచ్చుకోవాలని తేల్చిచెప్పేశారు.

న్యాయం చేయాలి

జిల్లాలో చాలా మంది టీచర్లు గతంలో పొందిన అంగవైకల్యం శాతంకు ప్రస్తుతం పొందిన అంగవైకల్యం శాతంకు వ్యత్యాసం ఉంది. ఈ విషయంలో కొంత మంది టీచర్లు తమ సంఘం దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల తిరుపతి జిల్లా రుయాలో చేపట్టిన ఆరోగ్య పరీక్షల్లో అన్యాయం జరిగిందని బాధిత టీచర్లు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారులు పునఃపరిశీలన చేసి వారికి న్యాయం చేయాలి.



– జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, చిత్తూరు జిల్లా

'రెవెన్యూ' బదిలీలకు కసరత్తు

- ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలు
- పర్యవేక్షిస్తున్న కలెక్టరేట్ అధికారులు
- సమావేశం కానున్న మూడు జిల్లాల కలెక్టర్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రెవెన్యూ శాఖలో బదిలీల కసరత్తు వేగవంతంగా సాగుతోంది. ఈ బదిలీలు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తుండటంతో చిత్తూరు కలెక్టరేట్ అధికారులు కీలకం కానున్నారు. షెడ్యూల్ మేరకు బదిలీలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. బదిలీలకు చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.

తహసీల్దార్, వీఆర్‌ఓలు కలెక్టర్ పరిధిలో...

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తహసీల్దార్, వీఆర్‌వోల బదిలీలు కలెక్టర్ పరిధిలోకి రానున్నారు. ఆ రెండు కేడర్‌లను కలెక్టర్ పర్యవేక్షణలో బదిలీ చేయనున్నారు. మిగిలిన కేడర్‌లు డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు జాయింట్ కలెక్టర్ పరిధిలో బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ బదిలీలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తూ సీసీఎల్‌ఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏర్పాటైన కమిటీ లో నోడల్ ఆఫీసర్ గా చిత్తూరు కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా చిత్తూరు డీఆర్‌వోలు ఉంటారు. కొత్త జిల్లాల ప్రకారం ఏర్పాటైన కమిటీల్లో ఆయా జిల్లాల కలెక్టర్‌లు చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్‌లు మెంబర్‌లుగా, డీఆర్‌వోలు మెంబర్ కన్వీనర్‌లుగా వ్యవహరిస్తారు. అదే విధంగా డీటీ, ఎస్‌ఏ, జేఏ, టైపిస్ట్, ఇతర కేడర్‌ల బదిలీలకు జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్‌వోలు మెంబర్‌లుగా, ఏవోలు మెంబర్ కన్వీనర్ లుగా వ్యవహరించనున్నారు.

దరఖాస్తుకు రెండు రోజులే గడువు

బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు అవకాశం కల్పించారు. గడువు ముగిసేందుకు మరో రెండు రోజులే ఉండడంతో ఉద్యోగులు దరఖాస్తులు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెల 31వ తేదీ నాటికి ఒకే చోట ఐదేళ్లు పూర్తి అయిన ఉద్యోగిని బదిలీ చేయనున్నారు. వైద్య పరమైన కారణాలను పరిగణలోకి తీసుకుంటారు. ఈ కసరత్తును జూన్ 2వ తేదీ లోపు ముగించేలా కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ బదిలీల అంశంపై త్వరలో మూడు జిల్లాల కలెక్టర్లు సమీక్షలో పాల్గొననున్నారు.

కేసు వెనక్కి తీసుకోకపోతే నరికేస్తా

- ఆకనంబట్టు సర్పంచ్ పై టీడీపీ నేత వీరంగం
- కులం పేరుతో దూషణల పర్వం
- చంపేస్తానంటూ ఫోన్‌లో బెదిరింపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పూతలపట్టు మండలం ఆకనంబట్టు సర్పంచ్ మణిపై టీడీపీ నేత జయప్రకాష్ నాయుడు బండ బూతులతో దూషించాడు. నరికేస్తా..కాళ్లు చేతులు తీయిస్తానంటూ బెదిరింపులకు దిగాడు. పూతలపట్టులో కనిపిస్తే కొట్టి చంపేస్తానంటూ కులం పేరుతో దూషిస్తూ చెలరేగిపోయాడు. వీరి మధ్య గురువారం రాత్రి ఫోన్లో సంభాషణ జరిగింది ఇలా.. నేను జయప్రకాష్ (టీడీపీ నాయకుడు) మాట్లాడుతున్నా. ఎస్సీ, ఎస్టీ కేసు నాపై, మా అన్న హేమాద్రినాయుడుపై పెట్టావ్. కేసు వెనక్కి తీసుకోకపోతే కనిపించినా చోట కొడుతా.. ఇంటికొచ్చి కొడతా. పూతలపట్టులో కనపడితే కాళ్లు, చేతులు తీయిస్తా. శ్రీకాంత్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్)ను కొట్టాం. రెడ్లను కొట్టేసి నీ దగ్గరుకు వస్తాం. నీవేమి పెద్ద లెక్కలేదు. నాకొడకా ఏం ఫీకలేవ్.. మాది అధికారం.. ఎవరితో చెప్పుకుంటారో... చెప్పుకోండి. రెడ్లు ఎవరూ నిన్ను కాపాడలేరు. రోజూ కొడుతాను. రోజూ నాపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టు దమ్ముంటే. నా కొడకల్లారా... నీకొడుక్కి పెళ్లి కూడా కాదు.. చంపేస్తా. పనికిరాని లం.. కొడక్కల్లారా. నీకు దిక్కున చోట చెప్పుకోండి. జేసీబీ పెట్టి మీ ఇళ్లు కూల్చేస్తా. మీ ఊరికి వచ్చి చంపేస్తా. ప్రాణాలతో ఉండాలంటే కేసు వెనక్కి తీసుకో. నీ కొడుకు దొరబాబు(టీడీపీ మండల కన్వీనర్)..కాళ్లు పట్టుకున్నాడు. మాలోళ్లు అయితే కేసులు పెడుతారా. ఇప్పుడైతే ఎన్ని కేసులు పెడతారో పెట్టండ్రా. పత్రికల్లో రాయలేని పదజాలంతో బూతులు తిడుతూ... పూతలపట్టులో కనిపిస్తే కొట్టి చంపేస్తానంటూ ఆ టీడీపీనేత భయభ్రాంతులకు గురి చేశాడు. ఆ వాయిస్ రికార్డ్ బయటకు రావడంతో వైరల్‌గా మారింది. దీనిపై దళిత సంఘం నేతలు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాలుడి మృతి కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు: బాలుడు వెంకటేష్ మృతి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ మురళీనాయుడు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాలుడు వెంకటేష్ మృతికి సంబంధించి సత్యవేడు మండలం నరసరా జు అగ్రహారం చెందిన ముత్తు(60) ధనభాగ్యం(55), రాజశేఖర్(32) అరెస్టు చేశామన్నారు. గూడూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన చెంచయ్య, అంకమ్మకు చెంచుకృష్ణయ్య, రామలక్ష్మమ్మ, వెంకటేష్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు.

భర్త చనిపోవడంతో బాలున్ని వదిలి..

అంకమ్మకు ఏడాది కిందట నరసరాజు అగ్రహారానికి చెందిన ముత్తు రూ.10 వేలు ఇచ్చి సత్యవేడుకు తీసుకొచ్చారు. ఇక్కడికి వచ్చాక అంకమ్మ తన పిల్లలతో కలిసి బర్రెలు, బాతులకు కాపలాదారుగా ఉండేది. 3 నెలల కిందట అంకమ్మ భర్త చెంచయ్య చనిపోవడంతో సొంతూరుకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. తమకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చి వెళ్లాలని యజమాని ముత్తు పట్టుపట్టడంతో విధిలేని పరిస్థితుల్లో ఆమె 9 ఏళ్ల కొడుకు వెంకటేశ్‌ను వారి వద్దే వదలివెళ్లింది. బాలుడితో ముత్తు వెట్టి చాకిరీ చేయించుకోవడంతో పాటు హింసించేవాడు. కొన్నాళ్లకు బాలుడు వెంకటేష్‌ను తీసుకొని యజమాని ముత్తు తమిళనాడులోని కంచి ప్రాంతానికి బాతులు మేపడానికి తీసుకెళ్లాడు. అయితే తల్లి అంకమ్మ కుమారుడితో ఫోన్‌లో మాట్లాడేందుకు చాలాసార్లు ప్రయత్నించగా మీ కొడుకు కనిపించడంలేదని ముత్తు తెలిపాడు. దీంతో ఆమె ఈ నెల 19న సత్యవేడుకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా గుట్టురట్టయింది. కంచిలో ఉన్న సమయంలో బాలుడు అస్వస్థతకు గురి కావడంతో ఏప్రిల్ 11వ తేదీన కంచి సమీపంలోని లింగ ఆస్పత్రిలో చేర్పించగా.. 12న చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా కంచి వద్ద పాలేరు నదిలో పూడ్చి పెట్టినట్లు నిందితుడు ముత్తు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. పోలీసులు కంచికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని వెలికితీసి అక్కడి అధికారుల సమక్షంలో పంచనామా చేశారు. అనంతరం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

'ఉపాధి'పై ఇరువర్గాల దాడులు

వెదురుకుప్పం : మండలంలోని తిప్పినాయుడుపల్లె గ్రామంలో గురువారం ఇరువర్గాలు పరస్పర దాడులకు తెగబడ్డాయి. ఉపాధి హామీ ఏపీఓ మీనాకుమారి ఎదుట ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ రక్త గాయాలతో వెదురుకుప్పం పోలీసులకు ఓ వర్గం ఫిర్యాదు చేయగా మరో వర్గం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. దాడులకు గల కారణాలు తెలియరాలేదు. అయితే ఇరువర్గాల దాడులతో గ్రామంలో భయాందోళన నెలకొంది.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 80,964 మంది స్వామివారిని దర్శించుకోగా 32,125 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రైవేటు బస్సు చోరీ

తిరుపతి క్రైమ్: నగరంలోని ప్రైవేటు ట్రావెల్స్ బస్సును దొంగిలించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. రేణిగుంటకు చెందిన ముస్తఫా గత ఒకటిన్నర నెల నుంచి యూనివర్సల్ బస్సు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. టీఎన్02బీయూ 1030 నంబరు గల బస్సును ట్రిప్ నుంచి వచ్చాక చింతలచేను రోడ్డులో పార్కింగ్ చేసేవారు. రోజువారీలాగానే డ్రైవర్ శ్రీధర్, క్లీనర్ విజయ్ బస్సును పార్కిగ్ స్థలంలో ఆపి వెళ్లారు. బుధవారం రాత్రి పార్కింగ్ యజమాని ట్రావెల్స్ మేనేజర్ మునిరాజాకు ఫోన్ చేసి మీ బస్సును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని చెప్పాడు. దీంతో తనతో పాటు సాయిఈశ్వర్ ట్రావెల్స్ యజమాని మునిప్రసాద్, సెల్వకుమార్ చుట్టుపక్కల అంతా వెతికారు. బస్సు కనిపించకపోవడంతో యజమాని రవీంద్రకు తెలియజేశారు. అనంతరం గురువారం ఈస్ట్ స్టేషన్‌లో బస్సు యజమాని ఫిర్యాదు చేయగా దీనిపై కేసు నమోదు చేశారు.

విశ్వం విద్యార్థుల ప్రభంజనం



రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న విశ్వం విద్యాసంస్థల అధినేత

తిరుపతి కల్చరల్: జాతీయ స్థాయిలో గత నెల ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 9వ తరగతి విభాగంలో 400 మార్కులకు 370 మార్కులు సాధించి వి.మోక్షిత్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు కై వశం చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. అలాగే 6వ తరగతి విభాగంలో 300 మార్కుల కు 281 మార్కులతో హృతిక్ రాయల్, 275 మార్కుతో వి.నిహార్, 270 మార్కులతో సోహిని అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. వీరితో పాటు రస జ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహిదర్, అశ్విన్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. అలాగే గణితంలో 50/50 మార్కులు విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు సాధించడం రాష్ట్ర విద్యాశాఖకే గర్వకారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వంచందన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రెండు ప్రైవేటు పాఠశాలలపై చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని రెండు ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. కుప్పం మండలం పార్లపల్లిలో నిర్వహిస్తున్న హాకింగ్స్ ప్రైవేట్ హైస్కూల్ గుర్తింపును రద్దు చేస్తూ డీఈఓ వరలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా రామకుప్పం మండలంలోని శాంతినికేతన్ ప్రైవేట్ హైస్కూల్‌ను మూసివేశారు. ఈ మేరకు డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పించవద్దని చెప్పారు. తమ పిల్లలను తల్లిదండ్రులు సమీపంలోని ప్రభుత్వ, అనుమతి ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. చర్యలు తీసుకున్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల టీసీలకు తల్లిదండ్రులు కుప్పం, రామకుప్పం ఎంఈఓలను సంప్రదించాలని డీఈఓ కోరారు.

రైల్వే ట్రాక్‌ల పటిష్టతకు చర్యలు

- రూ.3,200 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- ఫెన్సింగ్, సబ్‌వే వంటి పనులకు నిధులు
- సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ నిర్ణయం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ముంబై–చెన్నై కారిడార్ రైలుమార్గంలో రైల్వేట్రాక్ పటిష్టతను దృష్టిలో ఉంచుకుని సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. రైల్వే ట్రాక్‌కూ ఇరువైపులా ఫెన్సింగ్, సబ్‌వే వంటి పనులకు రూ.3,200 కోట్లు కేటాయించింది. ఇప్పటికే దాదాపు అన్ని లైన్లను 130 కి.మీ. స్పీడ్‌తో రైళ్లు వెళ్లేలా సామర్థ్యం పెంచిన నేపథ్యంలో ట్రాక్‌లపై ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

సబ్‌వేల నిర్మాణానికి ప్రతిపాదనలు

మూగజీవాలు, వన్యప్రాణులు, పాడిపశువులు, ఆత్మహత్యలు, సంఘవిద్రోహ శక్తులు వంటివి ట్రాక్‌పైకి రాకుండా పటిష్ట చర్యల్లో భాగమే ఫెన్సింగ్ విధానం. వాడి, గుంతకల్, ఖాజీపేట, కడప, తిరుపతి, గూడూరు తదితర మార్గాలలో ఫెన్సింగ్ లేదా ప్రహరీ, సబ్‌వేలు నిర్మించాలని ప్రతిపాదన లు చేశారు. ఆయా రైలు మార్గాల ఆధారంగా సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ నిధులు కూడా విడుదల చేసింది. రైలుమార్గాలు అటవీ ప్రాంతం, పట్టణ ప్రాంతాల వెళ్తున్నాయి. ప్రధానంగా అటవీ ప్రాంతాల్లో జంతువులు దాటుకునే క్రమంలో రైళ్ల కింద పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, పాడిపశువులు, ట్రాక్‌పైకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి.

వేగసామర్థ్యం తట్టుకునేలా..

వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్ల కోసం రెండేళ్ల క్రితం సౌత్ సెంట్రల్ రైల్వే తన పరిధిలోని అన్ని ప్రధాన మార్గాల్లో 130 కిలోమీటర్లకు పైగా వేగాన్ని తట్టుకునేలా సామార్థ్యాన్ని పెంచింది. హైస్పీడ్ రైళ్లు తిరుగుతున్న పట్టాలపై స్టీల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారుల సమీపంలో ఉన్న ట్రాక్‌లపై క్రియోసెట్ ఆయిల్‌తో ట్రీట్ చేసిన వెదురు బొంగులతో ఫెన్సింగ్ లేదా ప్రహరీలు నిర్మించనున్నారు. మరికొన్ని చోట్ల సబ్‌వే నిర్మాణాలకు చర్యలు చేపట్టారు.

మామిడికి గిట్టుబాటు బాధ్యత ప్రభుత్వానిదే

- తోతాపురి టన్నుకు రూ.25 వేలు ఇవ్వాలని రైతుల డిమాండ్
- కలెక్టరేట్‌లో మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులతో సమీక్ష
- పాల్గొన్న రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



సమీక్షలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర బాధ్యత కూటమి సర్కారుదేనని మామిడి రైతులు పేర్కొన్నారు. జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు గురువారం కలెక్టరేట్‌లో మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పాల్గొన్న జిల్లాలోని మామిడి సంఘాల నాయకులు, రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. మామిడి సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మామిడి కొనుగోళ్లు ఒకేసారి చేయడం వల్ల ఫ్యాక్టరీల వద్ద మామిడి రైతులు రాత్రింభవళ్లు క్యూలో ఉండాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. బంగారుపాళ్యం కు చెందిన రైతు మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మామిడి పంటకు టన్నుకు రూ .25 వేలు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. తవణంపల్లి మండలానికి చెందిన రైతు పద్మనాభనాయుడు మాట్లాడుతూ.. మామిడికి విపరీతమైన ప్రచారం కల్పించిన ప్రభుత్వం ప్రస్తుతం ఎందుకు గిట్టుబాటు ధర కల్పించలేకపోతోందన్నారు.

మామిడి బోర్డు ఏర్పాటుకు కృషి

జిల్లాలో మామిడిబోర్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చిత్తూరు జిల్లాలో మామిడి పంట అధికంగా ఉందన్నారు. మామిడి బోర్డు ప్రతిపాదనలను సంబంధిత శాఖలకు అందజేసి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులు ఇద్దరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడుతామన్నారు. ఉద్యానవన శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మామిడి గుజ్జు, జ్యూస్‌లపై జీఎస్టీ ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ.. మామిడి సీజన్‌లో తోతాపురి రకంకు గిట్టుబాటు ధర విషయంలో రైతులు, ప్రాసెసింగ్ కంపెనీల నిర్వాహకులు సమన్వయం ముఖ్యమన్నారు. పండ్ల పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు కట్ట మంచి బాబి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రాసెసింగ్ కంపెనీల్లో ఎక్కువగా గుజ్జు నిల్వ ఉందన్నారు. మామిడి గుజ్జుకు డిమాండ్ తగ్గిందన్నారు. సమీక్షలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్, భాను ప్రకాష్, చుడా చైర్మన్ హేమలత, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా జేసీలు విద్యాధరి, శుభం బన్సల్, ఆదర్శ రాజేంద్రన్, ఉద్యానవన శాఖ అధికారులు మధుసూదన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రవిచంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న రైతులు, అధికారులు